క్లుప్తంగా

ముమ్మరంగా రిజిస్ట్రేషన్లు



జగనన్న ఇంటిపట్టాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్న దృశ్యం

పుల్లంపేట : జగనన్న పేదలకు ఇంటిస్థలాలను మంగళవారం పుల్లంపేట సచివాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతంగా నిర్వహించారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా అర్హతే ప్రమాణంగా మహిళలకు ఇచ్చిన ఇంటిపట్టాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ ధనలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి వేమయ్య, డిజిటల్ అసిస్టెంట్ నారాయణ, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

దేవగుడిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు సునీతారెడ్డి, ప్రశాంతి, మహదేవరెడ్డి, రెడ్డినరేష్ 400 మంది ప్రజలకు వైద్య చికిత్సలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఏఎన్ఎం లక్ష్మీ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందజేస్తున్న సీహెచ్‌ఓ కోటేశ్వరరావు

పుల్లంపేట : పుల్లంపేట మండలంలోని పీవీ జీపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం పుల్లంపేట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ) కోటేశ్వరరావు విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు దగ్గరపడటంతో వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందించడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు.

పేద కుటుంబాలకు చేయూత

సిద్దవటం : మండలం లోని మాధవరం-1 గ్రామ పంచాయతీ లోని రెండు కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటును అందించడం జరిగిందని కడప తేజశ్విని చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ మాధవరం-1 గ్రామానికి చెందిన సాధు యశశ్వి రెండవ సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతుందన్నారు. ఆమె విద్యలో మరితగా రాణించేందుకు ఆమె కుటుంబానికి రూ.25 వేలు స్కాలర్‌షిప్ చెక్కును అందించామన్నారు. అదేవిధంగా రామక్రిష్టాపురం గ్రామానికి చెందిన మరో నిరుపేద మహిళలకు తోడ్పాటును ఇచ్చే కార్యాక్రమంలో భాగంగా టిఫన్ సెంటర్ నడుపుకునేందుకు అవసరమైన ఇడ్లీ పాత్ర, మిక్సీ, నిత్యావసర వస్తువులు అంజేశామన్నారు. ఈ కార్యక్రమంలో తేజశ్విని చారిటబుల్ ట్రస్టు సభ్యుడు చంద్ర, వెంకటేశ్వరపురం ఎంపీయుపి ప్రధానోపాధ్యాయుడు రామకేశవ, ఉపాధ్యాయుడు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇవ్వండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు

రాయచోటి అర్బన్ : విధులను నిర్వర్తిస్తూ మృతి చెందిన మున్సిపల్ కార్మికుల కుటుంబీకులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని అన్నమయ్య జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను కలిసి మాట్లాడారు. మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్‌లో నాన్‌పీహెచ్ వర్కర్‌లుగా పనిచేస్తు మరణించిన వారు, రిటైర్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబీకులకు ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో మృతి చెందిన కార్మి కుల స్థానం లో వారి కుటుంబీకులకు కాకుండా ఇతరులను నియమించడం సరైంది కాదన్నారు. వెంటనే మృతి చెందిన కార్మికులకు నష్టం కలిగేలా మదనపల్లె మున్సిపల్ కౌన్సిల్ చేసిన తీర్మానంను వెంటనే రద్దుచేయాలంటూ కోరారు. మదనపల్లె మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌నేతలు నాగరాజు,వాసు, గణేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ మురళీకృష్ణ



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌డీసీ, తహశీల్దార్ తదితరులు

పెనగలూరు (ఓబులవారిపల్లె): బూత్‌లలో సౌకర్యాలను మెరుగుపరచాలని తహశీల్దార్ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో బూత్‌లు ఉన్న పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 41 బూత్‌లకుగాను 7 బూత్‌లలో సౌకర్యాలు సక్రమంగా లేవని ఆయన తెలిపారు. ఈ బూత్‌లలో పనులను వేగవంతం చేసి పూర్తి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విద్యుత్, ఇతర సౌకర్యాలు ఈ ఏడు బూత్‌లలో లేవని ఆయన తెలిపారు. ఈ బూత్‌లను నేడు బుధవారం మరొక్కసారి పరిశీలించనున్నట్లు వారు తెలిపారు. విద్యుత్‌తోపాటు ఇతర సౌకర్యాలు మెరుగుపరచాలని ఆయన తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

చిట్వేలి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండే విధంగా ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎస్‌డీసీ లీలా రాణి బీఎల్‌ఓలకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనర్హులకు ఓటు కల్పించకుండా బీఎల్‌ఓలు జాగ్రత్తగా ఓటరు జాబితాలను పరిశీలించి నిర్ధారించాలని సూచించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహశీల్దార్ సుమతితో కలిసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు క్లెయిమ్స్‌ను తనిఖీ చేయాలి

సిద్దవటం : బూత్ లెవల్ అధికారులు క్లెయిమ్స్‌లను అప్రూవల్ చేసేటప్పుడు జాగ్రతగా తనిఖీ చేసి నిక్కచ్చిగా వ్యవహరించాలని తహసీల్దారు మురాషావలి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం బూత్ లెవల్ అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ జనవరి 23వ తేదీ నుంచి వచ్చిన క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నట్లయితే క్లియర్ చేయాలని బూత్ లెవల్ అధికారులకు ఆదేశించామన్నారు. అలాగే సిద్దవటం మండలంలోని మాధవరం-1, మాధవరం-2 , సిద్దవటం, పెద్దపల్లి, వంతాటిపల్లి, ఉప్పరపల్లి గ్రామ సచివాలయాలను తనిఖీ చేశామన్నారు. సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగ వంతం చేయాలని సూచించినట్లు ఆయన తెలిపారు.

కస్తూర్బా గాంధీ విద్యార్థుల సమస్యలు పట్టించుకోండి



కస్తూర్‌బా గాంధీ పాఠశాలలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్నా సీపీఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాల విద్యార్థుల సమస్యలు పట్టించుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జోతిచిన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం చిన్నఓరంపాడు కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాలను ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో హెచ్ఎమ్ లేక పోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తాగునీరు, భోజనం, మరుగుదొడ్ల సమస్యలు ఉన్నాయని అన్నారు. వెంటనే ఉన్నత అధికారులు పాఠశాలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కొరారు. సీపీఐ మండల కార్యదర్శి నాగమ్మ, ఎఐఎస్ఎఫ్ నాయకులు మధు, రమన, జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9న మండల సమావేశం

వాల్మీకిపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఈ నెల 9న ఉదయం 10 గంటలకు ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో షబ్బీర్ అహ్మద్ తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఆయన కోరారు.

హంద్రీనీవా కాలువ లీకేజీని అరికట్టండి

మదనపల్లె : హంద్రీనీవా కాలువలో లీకేజీ కారణంగా కృష్ణా జలాలు రోడ్డుపై వృథాగా ప్రవహించడమే కాకుండా, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు మంగళవారం జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు నెల రోజులకు పైగా హంద్రీనీవా కాలువ నుంచి నీరు లీకేజీ అవుతూ, బసినికొండ మెకానిక్ షెడ్‌ల గుండా చిత్తూరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తోందన్నారు. నీటిప్రవాహంతో షెడ్‌ల చుట్టూ నీరు చేరడమే కాకుండా లారీ బాడీ బిల్డింగ్, ఇతర పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. కరెంట్ షాక్‌తో షెడ్‌లలో పనులు చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు హంద్రీనీవా అధికారులను కలిసి, విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో రోడ్డెక్కి నిరసన తెలపాల్సి వచ్చిందన్నారు. హంద్రీనీవా అధికారులు తక్షణమే లీకేజీని అరికట్టి ఇబ్బందులు తొలగించాలని కోరారు.

సిద్దవటం కోటను సందర్శించిన వైఎంసీఏ ప్రతినిధులు



సిద్దవటం కోటలో కత్తిసాము విన్యాసాలు చేస్తున్న వైఎంసీఏ ప్రతినిధులు

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలోని మట్లిరాజుల కోటను మంగళవారం యంగ్ మెన్స్ క్రిష్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ)ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా వై.ఎం.సీ.ఏ నేషనల్ వైస్ ప్రెసిడెంటు డాక్టర్ బెస్టీ విలియమ్స్, మాజీ అధ్యక్షుడు, వైఎంసీఏ రీజనల్ చైర్మన్ రోలాండ్ మాట్లాడుతూ కాకినాడ, విశాఖపట్నం, భీమవరం, నరసారావుపేట మరి కొన్ని ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు మట్లిరాజుల కోటలో కర్రసాము, కత్తిసాము వంటి విన్యాసాలను చేపట్టారన్నారు. వైఎంసీఏ జిల్లా అధ్యక్షుడు పద్మాకర్ మాట్లాడుతూ సిద్దవటం లోని మట్లి రాజుల కోటకు చాలా చరిత్ర ఉందన్నారు. ఈ కోటను 16 మంది రాజుల వంశీయులు పాలించారన్నారు. కోటలోని శిల్ప సంపద చాలా అద్భుతంగా ఉందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : మున్సిపల్ కార్మికుల సమ్మె కాలంలో ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లకు జీఓలు విడుదల చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షులు సుంకర రవి కోరారు. ఈ అంశంపై మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కార్మికులు 16 రోజులు సమ్మె చేపట్టగా ప్రభుత్వ పెద్దలు, మంత్రులు, అధికారులు స్పష్టమైన హామీలు ఇవ్వడంతో సమ్మె ముగిసిందన్నారు. అయితే ఇంతవరకు జీఓ విడుదల చేయలేదన్నారు. డ్రైవర్లకు రూ.24,500, పారిశుద్ధ్య కార్మికులకు రూ.21,000, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500, కోవిడ్-19 కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న వారికి జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. డిమాండ్లను ఆమోదించకపోతే మళ్లీ సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు.

బాల్య వివాహాలు నేరం



ముగిరెడ్డిగారిపల్లెలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ బీఎల్ ప్రసాద్‌రెడ్డి

రామాపురం : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని మండల ఎస్ఐ బీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కల్పనాయినిచెరువు పంచాయతీ ముగిరెడ్డిగారిపల్లెలో మంగళవారం రాత్రి బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్న వయస్సులోనే బాలికలకు పురుషులకు వివాహాలు చేస్తే అటువంటి వారిపై చట్టరీత్యా చర్య తీసుకుంటామన్నారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురై చాలా మంది యువకులు బలి అవుతున్నారన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు వాహనానికి సంబంధించిన పర్మిట్లు, లైసెన్సు కలిగి ఉండాలన్నారు. లేనిచో వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. ర్పంచ్ వైష్ణవి, ప్రజలు వెంకట్రామిరెడ్డి, చెన్నారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, డ్వాక్రా మహిళ సంఘాలు పాల్గొన్నారు.

ప్రతిభాపాటవాలు పెంపొందించుకోవాలి

రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్



మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్‌ను సత్కరిస్తున్న నవోదయ విద్యాలయ సిబ్బంది

రాజంపేట : మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతిభాపాటవాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని రాజంపేట స్పెషల్ జ్యుడిషయల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ అన్నారు. రాజంపేట మండలంలోని నారమరాజుపల్లెలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం దేశభక్తి, వ్యక్తిత్వం, వికాసనైపుణ్యం కెరీర్ గైడెన్స్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు బహుళజాతి కంపెనీలకు భారతీయులే నిర్దేశకులుగా ఉన్నారన్నారు. సంకల్పబలంతో ఓర్పు ఆసక్తి కలిగిన విద్యార్థి జీవితంలో తప్పక రాణించగలరన్నారు. ప్రిన్సిపాల్ గీత, రిటైర్డ్ తహసీల్దారు జయన్న, కేంద్రపురావస్తుశాఖ రిటైర్డ్ ఉద్యోగి రామాంజినేయులు, రిటైర్డ్ ఆల్విన్ కర్మాగార అధికారి బాలాజీరావు, నవోదయ విద్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్‌ను ప్రిన్సిపాల్ గీత, విద్యాలయ సిబ్బంది సన్మానించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



రాజంపేట కోర్టులో లోకాఅదాలత్ నిర్వహణపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కే.లతా

రాజంపేట : రాజంపేటలో మార్చి 9న చేపట్టే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి కే.లతా అన్నారు. మంగళవారం రాజంపేట కోర్టులో లోక్ అదాలత్‌పై న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య సిబ్బంది స్థానికంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి

నందలూరు(రాజంపేట) : మండల ప్రభుత్వ వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది స్థానికంగా నివాసం ఉండాలని హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హాస్పిటల్ డెవలప్ సొసైటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ డాక్టర్లు ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ (104)కు తప్పనిసరిగా హాజరు కావాలని, గర్భిణులను పరీక్షించి కాన్పులను నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో వార్డు, ఫార్మసీ, కాన్పుల గదిని సందర్శించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, మండల అభివృద్ధి అధికారి బుక్కే శేఖర్ నాయక్, అన్నమయ్య జిల్లా వక్ఫోర్డ్ కార్యదర్శి సయ్యద్ అమీర్, స్థానిక నాయకులు ఆర్ముగం విశ్వనాథ్, సిహెచ్‌ఓ వెంకటనారాయణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఓలు ఇవ్వకపోతే మరో సమ్మెకు సిద్ధం

రాయచోటి అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమ్మె కాలంలో ఒప్పుకున్న డిమాండ్‌లకు సంబంధించి ప్రభుత్వం వెంటనే జీఓలను విడుదల చేయకపోతే మరోమారు సమ్మెకు సిద్ధమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాయచోటి అధ్యక్ష,కార్యదర్శులు చెన్నయ్య,రాంబాబులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు యిచ్చిన హామీలను వెంటనే జీఓల రూపంలో వెంటనే అమలు చేయాలన్నారు. డ్రైవర్లకు రూ. 24,500లు, కార్మికులకు రూ.21వేలు, క్లాప్ ఆటోడ్రైవర్లకు రూ. 18,500లు జీతాలుగా వెంటనే అందచేయాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు అగ్గిరామయ్య, వెంకట్రామయ్య, తిరుపతమ్మ, కేశవమ్మ, సుహాసిని, రమణమ్మ, సిఐటియు నేతలు మదన్, సిద్ధమల్లు, సిద్దయ్య, హర్ష, నాగరాజ, సియం లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ నిర్వహణకు అనుమతులు తప్పనిసరి



నర్సరీ లైసెన్సులను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి సురేష్‌బాబు

చిన్నమండెం : కూరగాయలు, పూలు, పండ్ల నర్సరీలు నిర్వహించే యజమానులు ఉద్యాన శాఖ ద్వారా తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని మండల బాధ్య ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని దేవగుడిపల్లెలో నిర్వహిస్తున్న కూరగాయల నర్సరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సరీ యాక్ట్ ప్రకారం లైసెన్సులు లేకుండా నర్సరీలు నిర్వహిస్తున్న నర్సరీ యజమానులకు నోటీసులు జారీ చేశారు. వీరు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫారం-ఏతో పాటు వెయ్యి రూపాయలు చలానా చెల్లించి భూమి పాసు పుస్తకం, నర్సరీ లేఅవుట్, భూమి లీజు తీసుకున్నట్లయితే లీజు నకలు, మట్టి, నీటి నమూనా రిపోర్టులతో ఉద్యాన అధికారికి దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలన్నారు. ఇకపై లైసెన్సులు లేకుండా నర్సరీలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీఈఓ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం



అర్హులైన వారికి కళ్ల జోళ్లు అందిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శైలజ

వీరబల్లె (రాయచోటి టౌన్) : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఒక వరంలాంటిదని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శైలజ అన్నారు. మంగళవారం వీరబల్లె మండల పరిధిలోని పెదివీడు గ్రామంలోని సచివాలయం దగ్గర జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా వైద్యులు పలు వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే కంటి పరీక్షలు కూడా నిర్వహించి ఉచితంగా మందులతో పాటు కళ్ల జోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో రామచంద్రారెడ్డి, సర్పంచ్ నాగిరెడ్డి, మెడికల్ ఆఫీసర్ జియావుల్లా, ఇతరా అధికారులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



స్పందన ఫిర్యాదుల పరిష్కారాలపై వీఆర్ఓ, వీఆర్ఏలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహశీల్దార్

లక్కిరెడ్డిపల్లి: స్పందన కార్యక్రమం ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలని ఇన్‌చార్జ్ తహశీల్దార్ రెడ్డన్న వీఆర్ఓ, వీఆర్ఏలకు సూచించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓ, వీఆర్ఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో రెడ్డన్న మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్పందనకు వచ్చే ఫిర్యాదులకు గ్రామస్థాయిలో ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఎల్‌ఓలు గ్రామాలలో అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. గ్రామాలలో ఇంటిపట్టాలు పొందిన వారు రిజిస్ట్రేషన్ చేయించుకునేలా తెలియజేయాలని వీఆర్‌ఓలకు సూచించారు. ఆర్ఐ సమద్ ఖాన్, విఆర్ఓలు, విఆర్ఏలు పాల్గొన్నారు.

ఇలాగైతే.. పాఠాలెలా!

- ఒకేసారి ఆరుగురు అధ్యాపకుల డిప్యూటేషన్
- పాఠాలు జరగక విద్యార్థుల అవస్థలు
- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరిస్థితి ఇదీ!



మండల కేంద్రంలోని ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాల



కళాశాలలో అధ్యాపకులు లేక పోవడంతో ఖాళీగా కుర్చున్న విద్యార్థులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల ఒకేసారి ఆరు మంది అధ్యాపకులను డిప్యూటేషన్‌పై పంపించారు. ఫలితంగా పాఠాలు జరగక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కళాశాలలో ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, టెక్స్‌టైల్, ఐటీ బ్రాంచ్‌లు ఉన్నాయి. ఐటీ, టెక్స్‌టైల్ బ్రాంచ్‌లకు అడ్మిషన్‌లు లేవు. ఇక కంప్యూటర్ సైన్స్‌లో మూడు సంవత్సలకు కలిపి 91 మంది విద్యార్థులు ఉన్నారు. ఈసీఈలో 61 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కో బ్రాంచ్‌కు హెడ్‌తో పాటు నలుగురు మొత్తం అయిదు మంది అధ్యాపకులు ఉంటారు. అయితే కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి ఒకే సారి నలుగురు అధ్యాపకులు, ఈసీఈ బ్రాంచ్‌కు సంభందిచి ఇద్దరు అధ్యాపకులు మొత్తం ఆరుగురిని డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపించారు. కంప్యూటర్‌కు సంబంధించి హెడ్ ఒకరు ఈసీఈ ముగ్గురు అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. దింతో పరీక్షలు దగ్గర పడుతుంటే ఇంత మంది అధ్యాపకులను రిలివ్ చస్తే తమ పిల్లలు ఏ విధంగా చదువు కుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇష్టానుసారంగా అధ్యాపకులను పంపించడం వెనుకు ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ అధ్యాపకుల సంఖ్య ఎక్కువగా ఉండి ఉంటే పంపించాలి కాని ఇలా అకడమిక్ సంవత్సరం మధ్యాలో పంపిచడం ఏమిటని మండిపడుతున్నారు. డిప్యూటేషన్‌పై వెళ్లిన అధ్యాపకులను వెంటనే కళాశాలకు రప్పించాలని లేకుంటే కొత్త వారినైన ఏర్పాటు చేసి విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ విషయం పై కళాశాల ప్రిన్సిపల్ కే వేణుగోపాల్‌ను వివరణ కొరగా ఉన్నత అధికారుల ఆదేశాల మేర ఆరుమంది అధ్యాపకులను డిప్‌టేషన్‌పై పంపించామన్నారు. తమకు సిబ్బంది కొరత ఉందని వేంటనే నియమించాలని ఉన్నత అధికారులను కోరామన్నారు. త్వరలో ఒకరిని పంపిస్తామని ఉన్నత అధికారులు తెలిపారని సమాధానమిచ్చారు.

హాకీ టోర్నీ విజేతలు రాయచోటి విద్యార్థులు



విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్ : జిల్లా స్థాయిలో నిర్వహించిన సబ్ హాకీ టోర్నమెంట్ విజేతలుగా రాయచోటి రాజు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని హాకీ డైరెక్టర్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మదనపల్లెలో నిర్వహించిన జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో డివిజన్ స్థాయిలో రాయచోటి తరఫున 10 మంది సబ్ జూనియర్ ఆటగాళ్లు పాల్గొని విజయం సాధించారని తెలిపారు. వీరు త్వరలో జిల్లా స్థాయిలో పాల్గొంటారని అక్కడ కూడా విజయం సాధిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయికి కూడా ఎంపిక అవుతారని తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం రాజు విద్యాసంస్థలలో గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. విద్యాసంస్థల డైరెక్టర్ సుబ్బరాజు, ప్రిన్సిపల్ సదాశివరాజు,తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌కు అభినందనలు

మదనపల్లె : ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టిన గుండ్లూరి షమీమ్‌అస్లామ్‌ను మున్సిపల్ కౌన్సిలర్లు మంగళవారం అభినందించారు. ఎస్‌బీఆర్ లేఅవుట్‌లోని షమీమ్‌అస్లాం స్వగృహానికి మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజంలతో కలిసి వెళ్లిన కౌన్సిలర్‌లు దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో పార్టీకి విధేయురాలిగా ఉంటే పదవులు వాటంతట అవే వర్తిస్తాయనేందుకు షమీమ్‌అస్లామ్ మంచి ఉదాహరణ అని వారు అన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2018లో కడప జిల్లా మహిళా కోఆర్డినేటర్‌గా పార్టీకి షమీమ్‌అస్లామ్ అందించిన సేవలు ఎనలేనివన్నారు. షమీమ్‌అస్లామ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని అభినందనలు తెలిపారు.